బాబు

"నీ పేరు,"

"బాబు"

"ఇదివరకు ఏం చేసేవాడవ్ ? "

"కొట్లో"

"ఏం కొట్లో"

"మరి.... మరి.... కొట్లో"

చెప్పవోయ్ కుర్రవెధవా !" అంటూ చెవి మెలిపెట్టాడు గౌరీనాథం. బాబు మొహం వంకరలు తిరిగింది. చక్రంతిప్పే తాతప్ప అందరూ ఫక్కున నవ్వారు. బాబు మొహంలో రంగులు కరిగాయి.

"సైకిళ్ళు అవీ బాగుచేసే కొట్లో" అన్నాడు బాబు.

"మరెందుకు మానేశావ్"

నల్లగా వెడల్పుగావున్న గౌరీనాథం మొహంకేసి, వంపులు తిరిగిన మీసాలకేసి విచిత్రంగా భయంగా చూశాడు బాబు. ఇక్కడ అక్కడ చిరిగిన చొక్కాలోంచి ఉక్కుగుండులాంటి కండలు యివతలకి కనపడుతున్నాయి. ఉత్త భౌతికవాదంలాగ భయంకరంగా ఉన్నాడు గౌరీనాథం.

"ఎందుకు మానేశావు ?" తిరిగి అడిగాడు గౌరీనాథం.

"ఎందుకా ?" బాబు చెప్పటానికి సందేహించాడు.

"చెప్పరా నా కొడకా, సందేగం యెందుకు" అని ఆసరా యిచ్చాడు కొలిమిత్తినూదే వీరన్న.

"కొట్టాడు....సావకొట్టాడు దొంగనంజకొడుకు...." అన్నాడు బాబు కోపంతో. గౌరీనాథం పెద్దగా నవ్వాడు. యజమాని నవ్వుని తక్కిన వర్రం పనివాళ్ళందరూ అనుకరించారు.

"ఎంత యిచ్చేవారు నీకు"

"రోజుకి నాలుగణాలు."

"నాలుగే ! గుంటవెధవ్వి నీకు యింత జీతమా" అని గౌరీనాథం బాబుని నిదానంగా చూసి అన్నాడు.

"తెలివైనోడివే మరి ! జాగ్రత్తగా పని నేర్చుకుంటావా ?"

"ఆఁ"

"దొంగవేషాలేస్తే మక్కలిరగ తంతాను."

"ఊఁ !"

"కూడెక్కడ తింటావ్ ! నాలుగణాలకి రెండుపూట్ల కూడెవడు పెడతాడు ?"

"అదే ఆలోచిస్తున్నాను" అన్నాడు బాబు ఠీవిగా, కనురెప్పలు యెగరవేస్తూ.

"సూరేకారం వుందిరోయ్ యీడికి" అన్నాడు కొలిమిత్తి వీరన్న.

"అమ్మా, బాబూ వున్నారా ?" అన్నాడు గౌరీనాథం.

"సచ్చిపోయారు, దొంగ ఎధవలు"

అందరూ యీ జవాబువిని నవ్వినా, గౌరీనాథంమాత్రం నవ్వలేదు. తుమ్మచెక్కల్లాంటి అతని రొమ్ములలో యిటువంటి అనుభవం యేదో వుంది.

"నేను కూడు పెడతాను. మరి జీతం యివ్వను. నాదగ్గరే ఉందువు కాని, సరేనా" అన్నాడు.

"ఊఁ" తన సమ్మతిని తెలిపాడు బాబు. గౌరీనాథం తన బిరుసైన మీసం సవరించి నవ్వాడు. అంటే యేదో చెప్పబోతున్నాడని అందరికీ తెలుసును. చక్రం తిప్పే తాత కళ్ళు మూసుకునే వింటున్నాడు.

"ఇదే వయస్సులో నాకు బాబు పోయాడు. అమ్మవుంది. ఉంటే మాత్రం ఒక కాలూ, ఒక చెయ్యీ పడిపోయింది. ఆ రోజుల్లో యెంత కష్టపడేవాణ్ణి. మరి యీ కాలం కుర్రాళ్ళలాగానా !"

"ఎంతమాట" అన్నాడు వీరన్న.

"పాపం. మహా కట్టంలెండి" అన్నాడు రంపపుకోత ఆపుచేసి పెదయ్య. గౌరీనాథం తిరిగి ప్రారంభించాడు.

"రెండేసి రోజులు కూడులేకుండా వుండి పని నేర్చుకునేవాణ్ణి. దోసకాయలు తిని బ్రతికేవాణ్ణి. మునసబుగారి యింటికి పది బిందెల నీళ్ళు మోసేవాణ్ణి. రాత్రి పగలూ అనక, దెబ్బలు, చీవాట్లూ తింటూ యీవడ్రం పని నేర్చుకున్నాను. మరి యిప్పుడు మనతో సమానమైన వడ్రంగి యెవడంటాను ? మునసబుగారికీ, జమీందారుగారికీ, కోట రామయ్యగారికి...."

"మీరే చేసి యివ్వడం" అని పూర్తిచేశాడు వీరన్న. పనివాళ్ళందరూ తమ యజమాని ఉపన్యాసానికి తలలువూపి "సెభాష్" అన్నారు. బాబు మాత్రం అక్కడవున్న పెద్దపెద్ద దూలాల్నీ, రంపపుపొట్టు వాసననీ, అమాయకంగా పడివున్న బల్లలూ చెక్కలూ అతి విచిత్రంగా కుర్చీలూ, బీరువాలూ అయిపోయే మహత్తునీ వింతగా చూస్తూ నిలబడ్డాడు. గౌరీనాథం మాట్లాడుతూన్నంతసేపూ అందరూ పనులు మానేసి కులాసాలో కబుర్లలో పడ్డారు. గౌరీనాథం హెచ్చరించాడు కాని పనివాళ్ళు వినిపించుకోలేదు. తాత మాత్రం కునుకుపాట్లు పడుతూనే చక్రం తిప్పేస్తు

న్నాడు అతనిచెయ్యి సంవత్సరాల అలవాటువల్ల తక్కిన దేహంనుంచి విడివడి ఒక ప్రత్యేక మనస్తత్వాన్ని అలవరచుకుంది. రాములు శ్రీరామ నవమి ఉత్సవాలలో భోగం ఆటని వర్ణిస్తున్నాడు.

"అబ్బా, అబ్బా. ఏం సోకు. ఏం సోకురా ఆళ్ళకి. ఏం గుమాగా ఆడిందిరా, బుగ్గమీద యేలేసుకుని 'తూరుపు తెల్లారే నాసాఁయీ' అంటూ, ఏంసోకు, ఏంసోకు." గౌరీనాధం హెచ్చరిస్తున్నా, రాములు తన ధోరణిని మానలేదు. గౌరీనాధం ఉగ్రుడైపోయి సుత్తిపట్టుకుని కేకలు వేస్తూ రాములు తలమీద కొట్టబోయాడు. రాములు తప్పుకోకపోతే తల పగిలిపోయి వుండును.

గౌరీనాధం కార్ఖానా చాలా పెద్దది. ఇప్పుడు ఆ వూరికి దూరంగా ఉండే పెద్ద మైదానంలో కట్టే మిలటరీ పనులకి యితను వడ్రంగి. కంట్రాక్టు పద్ధతిమీద పనిసాగుతోంది. తాపీ పనివాళ్ళూ, వడ్రంగులూ, యితర కూలీలూ అక్కడే చిన్నచిన్న గుడిసెలు వేసుకుని కుటుంబాలతో వుంటున్నారు. ఈ మిలటరీ నిర్మాణం సగంలో ఆపివేశారన్న విషయం యీ కథకి ప్రస్తుతం కాదు.

"ఇంటికి పోదాం పద" అన్నాడు గౌరీనాధం బాబుతో. బాబు చేతో చిన్నమూట పట్టుకుని వెనకాలే వెళ్ళాడు. ఒకే సైజులో వరుసగా గుడిసెలు తీర్చిఉన్నాయి. చూరుల్లోంచి దీపం వెలుతురు యివతల నేల మీద సన్నంగా సాచుకుని పడుతోంది. గుడిసెల వెనకాలఉన్న పెద్ద తుమ్మలబీడు చీకట్లో చీకటిలా భయంకరంగా ఉంది.

"ఈ కుర్రాణ్ణి పనిలో చేర్చుకున్నాను. వీడికి తిండిపెట్టు" అని గౌరీనాధం భార్యతో చెప్పాడు. బాబు భోజనంచేసి మూట తలకిందపెట్టు కుని ఒకమూల పడుకున్నాడు. అలసిపోయిన అతని దేహం విశ్రాంతిని కోరుతోంది. ఇంతలోకి గౌరీనాధం చిన్నకూతురు గంగి అక్కడికి వచ్చింది. బాబు మొహం పరీక్షించి యిలా అంది.

"నువ్వు దిక్కులేనోడివి కదూ ?"

"ఆఁ" అన్నాడు బాబు గర్వంగా.

"మరి నీజుత్తు దువ్వుకోలేదేం?"

"నా యిట్టం."

"అదేంటి-అంత వణ్ణం తినేశావ్. గేదలాగ. ఎంత తినేశావో."

"ఆకలేసింది. పొద్దుట కూడుతినలేదు" అన్నాడు బాబు. అతను ఆవులించాడు.

"నాదగ్గర ఎన్నో గమ్మత్తులున్నాయి. నీకు చూపించనులే" అంది గంగి మూతి ముడుచుకుని.

"ఉఁ"

"అప్పుడే నిదరేంటి – ఛా!"

"పో పో నంజా నాకు నిదురొత్తుంటే" బాబు నిద్రపోయాడు.

గంగి అలాగే కూచుని కబుర్లుచెప్పి చివరికి విసుగెత్తి వెళ్ళిపోయింది.

2

బాబుకి వద్రంపని ఏమి చాతవడం లెదు. గౌరీనాధం తిట్టిపోస్తున్నాడు. అన్నిటికన్నా, కొలిమిత్తి-త్తి వీరన్నకూడా అదమాయించడం బాబుకి ఏమీ బాగాలేదు. కార్ఖానాలో ఉన్నంతసేపూ బాబుకి గంగి చూపెట్టిన సంగీతపు పెట్టెమీదనే దృష్టి ఉంది. అది నోట్లో పెట్టుకుని వూదితే, రకరకాల స్వరాలతో బలేగా మోగుతుంది.

"ఎక్కడ కొన్నావు నువ్వు?" అన్నాడు గంగితో.

"తీర్థం" అంది గంగి.

"ఎక్కడా?"

"గూడెం అవతల"

"ఓస్ అంతేనా, నేనూ కొనుక్కుంటాను."

"మరి నీకు డబ్బులేవీ ?"

"నా దగ్గర ఎన్నో డబ్బులున్నాయ్. బోలెడు...."

"అయితే నేనూ వత్తాను" అంది గంగి ఉత్సాహంగా.

"పనిమానేత్తే. నీ బాబు నన్ను తంతాడు. మరి ఎలాగ ?" అని సందేహించాడు బాబు.

"మా బాబు దొరగారిని కలుసుకొందుకు వెళ్ళాడు. చంద్రాలకి కాని రాడు."

బాబు మొహం వికసించింది. "అయితే మధ్యాన్నం వత్తాను. తయారుగావుండు గంగీ" అన్నాడు తల వూపింది గంగి.

మధ్యాహ్నం ఎండలో యిద్దరూ బయలుదేరారు తీర్థానికి. గూడెం రోడ్డు దుమ్ము ఎర్రగా కాలి పైకి లేస్తోంది, పైకి ఉత్సాహంగావున్నా బాబుకి పెద్ద ఆలోచన పట్టుకుంది. తనదగ్గర డబ్బేమీలేదు. గంగితో గొప్పగా అబద్ధం ఆడేశాడు. ఇప్పు డెల్లాగ!

పొలిమేరలో తీర్థం కనబడింది. ఇద్దరి కళ్ళల్లో ఆశ్చర్యపు ఇంద్ర ధనుస్సులు రంగురంగులుగా విరిగాయి. రంగురంగుల దుస్తులూ, మను ష్యులూ, బొమ్మలూ, బుడగలూ, బూరాలూ, మిఠాయికొట్లూ – అన్నీ రంగురంగులే!

"ఎంతమందో" అంది గంగి.

"సముద్రం సముద్రం" అన్నాడు బాబు. ఒక్కొక్క కొట్టు దగ్గర ఆగారు. ఒక్కొక్క విచిత్రాన్నే చూశారు వింతగా, ఆశగా.

"ఇదే, యిక్కడే సంగీతప్పెట్టె అమ్ముతారు" అంది గంగి. బాబు సంగీతపు పెట్టెని జాగ్రత్తగా ఠీవిగా పరిశోధించి "ఎంత ?" అన్నాడు.

"మూడణాలు" అన్నాడు కొట్టువాడు.

బాబు కనురెప్పలు పైకి ఎత్తి ఏదో ఆధ్యాత్మిక చింతన చేస్తోన్నట్టు ఆలోచించాడు.

"కొనవేంటీ !" అంది గంగి.

"నువ్విక్కడే వుండు గంగీ. నే నిప్పుడే వత్తాను" అంటూ బాబు లేచాడు. "దబ్బునరా యేం ?" అంది గంగి.

బాబువైపే చూస్తోంది గంగి. బాబు ఆ జనంలో కలిసిపోయాడు. కాసేపట్లో ఒక పెద్దమనిషి పక్కన కనపడ్డాడు. పెద్దమనిషి నెత్తిమీద తలపాగా వుంది. కాళ్ళకి కిర్రుచెప్పులున్నాయి. సరీసరిపడని పాతకోటు తొడుక్కున్నాడు. బాబు ఆ పెద్దమనిషిని ఆనుకునే నడుస్తూవున్నాడు. బాబు కుడిచెయ్యి కదిలింది. చేతివేళ్ళ చివర ఒక తెలివి మెల్లగా కదలింది. బాబు చెయ్యి పైకి ఎత్తాడు. పెద్దమనిషి జేబులోనికి చొచ్చుకుని మరునిమిషంలో యివతలికి వచ్చింది ఆ చెయ్యి.

"దొంగ దొంగ" అన్నాడు పెద్దమనిషి. కేకలేస్తూ బాబుని పట్టుకున్నాడు. బాబు చుట్టూ జనం మూగడం చూసింది గంగి. బాబుని కొట్టిన చప్పుడు వింది. బాబు ఏడుపు వినపడింది. కొంతసేపటికి బాబు ఏడుస్తూ ఎర్రని కళ్ళతో వచ్చాడు. చొక్కా దుమ్ముతో ఎర్రబడింది.

"గట్టిగా కొట్టారా ?" అంది గంగి.

"సావకొట్టారు. దొంగనంజకొడుకులు" అన్నాడు బాబు. అతని మోచెయ్యీ కాలూ కొట్టుకుపోయాయి. వీపుమీద అయిదువేళ్ళ వారలూ దళసరిగా మంటమంటగా ఉన్నాయి.

"అయ్యో పాపం — ఎలా కొట్టారో ? జేబులో చెయ్యిపెడితేనే కొడతారేంటీ !" అంది గంగి.

"అదే నే ననుకొంటున్నదీని...." అన్నాడు బాబు రోషంగా సాగదీస్తూ.

రోడ్డుమీద యిద్దరూ నడిచి యింటికి పోతున్నారు. బాబు విచారంగా గంభీరంగా ఉన్నాడు; ఓడిపోయిన పెద్దరాజులాగ. గంగికి

యిదేమీ బాగాలేదు. ఏదోవిధంగా బాబుని సంతోషపెట్టాలనుకుంది. కార్ఖానా సమీపించేముందు యిలా అంది :

"పోనీ, నా సంగీతపెట్టె యిత్తానులే."

"అక్కర్లేదు—"

"తీసుకుంటేనేం - మరి నా జత ఉండవా?" గంగి జాలిగా అడిగింది.

"మరి - మరి మీ బాబుతో యిదంతా సెప్పకేం?"

"సెప్పను."

"ఒట్టెయ్యి—"

"ఉఁ ఒట్టు."

గంగి యిచ్చిన సంగీతపు పెట్టెని పెదవుల మధ్యకి పోనిచ్చి ఉత్సాహంగా ప్రమోగించాడు బాబు. చుట్టూ పొడుగ్గా పెరిగిన సర్వీచెట్లు కూడ ఉత్సాహంగా ఆ ధ్వనికి యిటూ అటూ ఊగాయి.

3

కార్ఖానాలో పని తీవ్రంగా సాగిపోతోంది. ఎండగాడ్పు వేడిగా మొహానికి కొట్టుతోంది. అక్కడికి కొద్దిగా దూరంగా తాపీవాళ్ళు కూలీలూ పదాలు పాడుకుంటూ పనిచేస్తున్నారు. గౌరీనాధం చెమటలు కక్కుతూ బల్లల్ని సాపుగా చెక్కుతున్నాడు. బొగ్గునలుసులు పడి వీరన్న కళ్ళు ఎర్రగా వున్నాయి. నిద్రలోవున్న తాత చెయ్యి చక్రాన్ని గిరగిర తిప్పేస్తోంది. "ఒరేయిజాగ్రత్త. అక్కడ బంధులు సరీగ్గా బిగించు - అక్కడ వంపు సరీగా చెక్కాలి." అంటూ గౌరీనాధం మధ్య మధ్య హెచ్చరిస్తున్నాడు. బాబు పెద్ద పెద్ద మేకుల్ని కర్రలోకి దిగగొట్టుతున్నాడు.

రంపపు పనివాడు పరాకుగా లైను తప్పించి కోశాడు. గౌరీనాథం ఛర్రున అక్కడికి వెళ్ళాడు. "ఏరా యెదవకొడక - యిదేం పనిరా, వందరూపాయల దూలం తగలేశావ్" అంటూ అతని గొంతుక పట్టుకున్నాడు. ఆ పిడికిలిలో మృత్యువుయొక్క బలం వుంది. రంపపు పనివాడి గొంతుక నరాలు లావుగా పగులుతోన్నట్టుగా వుబికాయి. అంతనల్లని మొహమూ ఎర్రగా అయిపోయింది. చివరకి కొనవూపిరితో వాణ్ణి వదిలేసి గౌరీనాథం తన పనిలోకి వచ్చి కూర్చున్నాడు.

బాబుకి భయం వేసింది. ఈ పని కొత్తగా, అసహ్యంగా బాధగా వుంది. ఆ ఎండగాడ్పుకి మరికాస్త దాహం ఎక్కువయింది. పైకి తేలికగా కనపడుతుంది యీ పని. కాని మనిషి బలం అంతా చేతివేళ్ళలో ఆనుకుని ఉంటుంది. ఇంతకన్న ధాన్యంబస్తా మొయ్యడం సులభం అనిపించింది. పెద్ద బరువైన సుత్తిని పైకెత్తి గురితప్పకుండా ఆ మేకుల్ని కొట్టాలి. అతనికి చేతికండలు పీకుతూన్నట్టు అనిపించాయి. గౌరీనాథం మెల్లగా వచ్చి బాబు జుట్టు పట్టుకుని పైకి లేవదీశాడు. "ఏరా కునుకుపాట్లు పడుతున్నావ్ ! ఆ మేకు అలా వంకరగా దిగిందేమిటి?" అన్నాడు.

"గాడిద కొడుకు ! ఎంత పొగరు యీడికి" అని వీరన్న తన అభిప్రాయం వెల్లడించాడు.

"సేతులు పీకుతున్నాయి" అన్నాడు బాబు భయంతో.

"కంచెడు వణ్ణం తినగలవా ? ఈ పని లాభంలేదు నీకు. పోయి ఆ దూలంచెక్కలిటు మోసుకునిరా. వేషాలేస్తే చితకకొడతాను" అన్నాడు గౌరీనాథం.

దూలపు చెక్కలు రోడ్డుకి అటుపక్కన పడి వున్నాయి. ఎండ అతి తీవ్రంగా ఉంది. అసలే అలసటగావున్న బాబుకి ఏడుపువచ్చింది. చెక్కలు మరీ బరువుగా వున్నాయి. దూరంగా కూలీలు సున్నం దంపు

తున్నారు. ఆ పని అయితే తేలికగా ఉంటుందేమో అనుకున్నాడు. ఆ సున్నం దంపులోంచి ఒక మనిషి కార్ఖానా వైపు వచ్చాడు. "ఏం యిలా వచ్చావ్ వెంకడూ?" అన్నాడు గౌరీనాథం.

"ఓ సుట్టముక్క యిప్పించండి మేస్త్రిబాబు గారూ" అన్నాడు వెంకడు. గౌరీనాథం వెంకడితో మాట్లాడుతూ ఉండటం గమనించాడు బాబు. ఆ దూలపుచెక్కని అతని భుజం భరించలేకపోతోంది. ఎందుకో తెలియని ఉక్రోషం అతని గొంతుకలో వుండలా చుట్టుకుని వుంది. సగంవరకూ మోసుకువచ్చిన ఆ చెక్కని దభీలున కిందపడేశాడు. గౌరీనాథం, కొలిమిత్తి వీరన్న పరుగెత్తుకు వచ్చారు.

"ఏంటదీ-" అన్నాడు వీరన్న.

"బరువెక్కువయింది" అన్నాడు బాబు.

గౌరీనాథం ఒళ్ళుమండింది. బాబు జుట్టు పట్టుకుని యీడ్చి గిరవా వెయ్యాలన్నంత కోపం వచ్చింది. బలమైన నల్లని చెయ్యిని ముందుకు పోనిచ్చాడు. ఇంతలో వెంకడు పెద్ద కేక వేశాడు. "ఓరి బాబు, ఇక్కడున్నావేంటి నీ పిన్నమ్మ యిక్కడే వుంది" అంటూ "ఓసి మాలచ్చీ, యిడిగిడుగో నీ కొడుకు!" అని సున్నం దంపువైపు చూసి పిలిచాడు. గౌరీనాథం తమాయించుకుని "కుర్రగుంటడివని ఈసారికి వూరుకున్నాను. ఎత్తు ఆ చెక్కని" అని గర్జించాడు.

మా లక్ష్మి సున్నంతో తెల్లబడిన చేతులతో కొప్పు సవరించుకుంటూ అక్కడికి వచ్చింది. బాబుని చూసి ఆశ్చర్యపడి "దొంగవెధవ ఇలా పారిపోయొచ్చావ్" అంది. బాబు మొహం కోపంతో జేవురించింది. గౌరీనాథం ఏమిటని అడిగాడు. తల్లీ దండ్రీ పోగానే తాను జాలితలచి యింట్లో పెట్టుకున్నట్టూ, ఉన్నట్టే ఉండి పారిపోయినట్టూ మాలక్ష్మి చెప్పింది.

"ఈడి తండ్రి కొద్దిగా డబ్బుసేసుకుని మమ్మల్ని లోకువగా సూసేవాడు. ఈడి తల్లి వృత్తి దొంగముండ. దొంగతనంచేసి డబ్బు సంపాయించింది. ఈడికి ఎంత పొగరు బాబూ, యిదివరకు లాగ ఆడికి

మంచం లేదంట, యిదివరకటిలాగి బళ్ళోకి వెళ్తాడంట.... సేపలకూర నేందే వణ్ణం సయించదంట.. సివరకి తండ్రి వ్యాపారంలో డబ్బు తగలేసుకుని సచ్చాడు. అందరూ సచ్చినా యీడికి పొగరు సావలేదు. పాలేరుపని సేసుకుంటూ యింటికాడ ఉండకూడదూ" అంది.

"చాంగముండ, అంతా అబద్ధం చందాలదాకా పనిసేయించుకుని కూడెట్టేదికాదు" అన్నాడు బాబు.

"ఓరి నీ జిమ్మడా... " అంది మాలక్ష్మి.

"మా బాబు డబ్బున్నాడని చీరికి ఈసు" అన్నాడు బాబు.

"పోనీ నాతో వచ్చెయ్యి ఈ యేడాదినుంచీ ఎక్కడున్నావ్" అంది మాలక్ష్మి.

"ఓ అనేకచోట్ల...." అన్నాడు బాబు.

"నీ పిన్నమ్మతో వెళ్ళిపోరా" అన్నాడు గౌరీనాధం.

"నాను యెల్లను. ఎదవగుడిసె యెదవకూడూ....అత్తమాసూ దీని మొగుడు సావకొడతాడు"

"ఓరి గుడిశేటికొడకా, యాడు నీకు గంజి పోత్తాడో సూత్తాను. దిక్కులేక సత్తావులే." అంటూ మాలక్ష్మి కోపంతో వెళ్ళిపోయింది. గౌరీనాధం వీరన్నకేసి అర్థవంతంగా చూసి మాలక్ష్మి వెనకాతలే వెళ్ళాడు.

బాబు చెక్కలు మోసుకొస్తున్నాడు పని చప్పబడింది కార్ఖానాలో. వీరన్న, రాములూ, బాబుని ఆక్షేపణగా ఎత్తిపొడుస్తున్నారు. సూర్యుడు క్రమంగా పడమరకు వాలుతున్నాడు. కాలిన భూమి నెరదల్లోంచి వేడి వేడి ఆవిరి పైకి వస్తోంది.

"నీ అమ్మ ఎంతమందితో తిరిగేది?" అన్నాడు వీరన్న.

"నంజకొడక" కోపంతో తిట్టాడు బాబు.

"తిడితే సంపేత్తాను. మళ్ళీ తిట్టు."

"నువ్వంటే నేను తిడతాను"

"నీ అమ్మ ఎంతమందితో...." వీరన్న అన్నాడు.

"నంజకొడక—" అన్నాడు బాబు.

వీరన్న ముందుకు దుమికి "సత్తావురా నా కొడక" అన్నాడు. బాబు భయంతో మోసే ఆ చెక్కల్ని కిందపడేసి పారిపోయాడు.

"ఏయ్ గంగీ - నా సంగీతపెట్టి యిలా యివ్వు" అన్నాడు బాబు గౌరీనాథం యింటికెళ్ళి.

"నీదేంటిరా సచ్చినోడ....నాదీ" అంది.

"నాకు అచ్చంగా యివ్వనేదూ" అన్నాడు బాబు.

"ఏడుత్తున్నావని యిచ్చాను"

"దొంగముండ....నీ జతలేను" అంటూ బాబు అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

ఎప్పటికీ బాబు రాకపోవడం చూసి గంగి వెతకడానికి బయలుదేరింది. సర్వీచెట్లక్రింద బాబు నేలమీద పడుకొని నిద్రపోతున్నాడు.

"ఇక్కడ తొంగున్నావేంటి, యెర్రి ఎదవ" అంది గంగి పెద్ద దానిలా మొహంపెట్టి.

"ఆలోచిత్తుంటే నిదరట్టింది" బాబు లేచి యిటూ అటూ చూసి "ఏదే దొంగముండ నా కత్తి" అన్నాడు. నేలమీద చేతులుపెట్టి వెతికి తుప్పుపట్టిన విరిగిన కొడవలి పైకి తీశాడు.

"ఎందుకిదీ?" అంది గంగి.

"సంపెయ్యడానికి"

"ఎవణ్ణి?" అంది గంగి అర్థమవక.

"ఆణ్ణి - ఆ ఈరన్న నంజకొడుకుని" గంగి ఫక్కున నవ్వింది. ఇంతలోకే తీవ్రంగా మొహంపెట్టి.

"నా దగ్గర పెద్దకత్తి ఉంది. మాంచికత్తి ! దాంతో చంపెయ్యడానికి బావుంటుంది" అంది.

"నిజం ?"

"ఆఁ."

"అయితే యింటికి పోదాం పద గంగీ" అన్నాడు బాబు.

ఆ మసక చీకట్లో ఈ విధంగా వీరన్నని చంపెయ్యడానికి తీర్మానించుకుని యిద్దరూ యింటికి బయల్దేరారు. బాబు గుండెల్లో పెద్దకోపం, ఏడుపూ, ఉక్రోషం నిండుకుని ఉన్నాయి. కాని గంగి సహాయంతో వీరన్నని సులువుగా చంపెయ్యవచ్చునని తెలుసుకున్నాక అతని మనస్సు తేలికపడింది.

4

ఈ రెండుమూడు రోజులనుంచీ బాబుని తన అజమాయిషీలో వుంచుకున్నాడు గౌరీనాధం. బాబు సగం సగం పనిలోపారిపోవడం. మేకులు తప్పుగా కొట్టడం, దురుసుగా మాట్లాడటం గౌరీనాధానికి చాలా కోపం కలిగించాయి. "బండికి కట్టిన గిత్త మొదట్లో మారాము చేస్తుంది. నాలుగు దెబ్బలు తగిలితేకాని దారిలో పడదు" అన్నాడు వీరన్నతో. నిజంకూడా అంతే ! స్వతంత్రంలోంచి దాస్యంలోకి పోయేముందు ప్రతి జాతీ, ప్రతి వ్యక్తి, ప్రతీ జంతువుకూడా ఓపికలేని తిరుగుబాటుని చేస్తాయి.

రేగిన జుట్టుతో, కాలిన మొహంతో బాబు దూలపుచెక్కలు మోస్తున్నాడు. వీరన్నని చంపలేకపోయే బాధ అతనికి యెక్కువగా వుంది. "సంపితే పోలీసులు జైల్లో పెడతారు కదూ...." అంది గంగి.

బాబుకి భయంవేసింది. కాని గంగి అంది" నువ్వు పోలీసు అవకూడదూ."

"ఎల్లాగ ?" అన్నాడు బాబు.

"పట్నం ఎల్లితే సెప్తుతారు."

"ఉహూఁ" అన్నాడు బాబు. పోలీసు అయాక వీరన్నని చంప టానికి తీర్మానించుకున్నాడు.

ఇంటికి వచ్చాక ఆ రోజున సాయంత్రం బాబు గంగితో అన్నాడు "నీ దాబు దొంగనంజకొడుకు."

గంగికి కోపం వచ్చింది. "ఏం?" అంది.

"ఈ యేల బరువైన సెక్కలన్నీ మోయించాడు. నాకు ఒళ్ళు నొప్పులెత్తింది" బాబు గద్గదికంగా అన్నాడు. గంగి జాలిగా "మాబాబు దొంగనంజకొడుకే - పాపం" అంది. బాబు కళ్ళమ్మట నీళ్ళు బొటబొట ప్రవహించాయి.

"కల్లుతాగితే వొళ్ళు నొప్పులు పోతాయి" అది గంగి.

"ఎవరు సెప్పారు ?"

"మా బాబు రోజూ చందాల తాగి వత్తాడు."

"మరి కల్లు ఎవరు పోత్తారు ?" అని అడిగాడు బాబు కళ్ళు తుడుచుకుంటూ.

"ఓస్ తెలియదూ....దూరంగా అక్కడ పోలేరమ్మ గుడికాడ సందులో...."

"ఊరికే పోత్తారా ?"

"ఉహూఁ - ఓ రూపాయి యిత్తే పోత్తారు,

"నువ్వుకూడా తాగుతావా ?" అన్నాడు బాబు.

"నా కొళ్లు నొప్పులెత్తుందే ఎందుకు" అంది గంగి.

అర్ధరాత్రివేళ బాబుకి మెలుకువ వచ్చింది. అంతా నిశ్శబ్దంగా వుంది. గౌరీనాథం గుర్రు కుక్క మొరిగినట్టుగా వినపడుతోంది. బాబుకి వొళ్ళు సలుపుతోంది. ఇంకా భుజంమీద దూలపుచెక్కలు బరువుగా ఉన్నట్టే అనిపించింది. 'కల్లు తాగితే—, అనుకున్నాడు బాబు. 'ఓ రూపాయి అవుద్ది' అనుకున్నాడు ఒత్తిగిల్లుతూ.

బాబు మెల్లగా లేచాడు. దీపం శెమ్మా ఒకమూల వెలుగుతోంది. గౌరీనాథం, పెళ్ళమూ ఒకళ్ళొకళ్ళు దగ్గరగా పడుకున్నారు. గంగి వేరే పడుకుంది. బాబు కళ్ళు రహస్యంగా భయంగా యిటూ అటూ చూశాయి. గోడకి పక్కగా ఉన్న కర్రపెట్టె మూత తియ్యబోయాడు. రాలేదు. తాళం గట్టిగా లాగాడు. చప్పుడయింది. అప్రయత్నంగా "యెదవపెట్టె, ఎంత లాగినా మూతరాదు" అంటూ గట్టిగా లాగాడు. గౌరీనాథం గబుక్కుని లేచి మంచంమీదనుంచి ఉరికాడు. దీపపు గుడ్డి వెల్తురులో కంగారు పడుతూన్న బాబు ముఖం కనబడింది.

బాబు మెడపట్టుకొని దవడమీద బలంకొద్దీ ఒకటి చరిచాడు గౌరీనాథం. "నా యింట్లోనే దొంగతనవంట్రా యెదవకొడక! వేలె డున్నావో లేదో.........."

బాబు బావురుమన్నాడు. గౌరీనాథం భార్యా, గంగీ లేచి ఏమీ అర్థమవక చూస్తున్నారు. గౌరీనాథం అడిగాడు, "ఏం చేస్తున్నావు యిక్కడ....?"

"ఓ రూపాయి అవసర మొచ్చింది...." అమాయికంగా, ఆందోళనగా అన్నాడు బాబు.

"ఏం ?"

బాబు మాట్లాడలేదు. అతని కాళ్ళూ, పెదిమలూ, చేతులూ అతి తీవ్రంగా వణకుతున్నాయి. జవాబు చెప్పని పెంకెతనానికి గౌరీనాథం తిరిగి లాగికొట్టాడు.

బాబు సహనశక్తి యింక తాళలేకపోయింది. అతని కళ్ళల్లో పెద్ద భయం నిస్పృహా హీనంగా వెలిగాయి. ఏదో చెప్పరాని తిరుగుబాటు అతనిలో కలిగింది ప్రక్కనున్న కర్రపేడుతీసి గౌరీనాథం మీద విసిరాడు. "నీ అమ్మ.... నీ.... దొంగనంజకొడక" అని తిట్లు అతను అప్ప చెప్పేస్తున్నాడు. గౌరీనాథం పక్కకి తప్పుకున్నాడు. ఈ తిరుగుబాటుకి గౌరీనాథం ఒక్క నిముషం ఆశ్చర్యంతో అలా నుంచునిపోయాడు.

"దొంగనంజకొడక, గుడిశేటికొడక.... నీ అమ్మా...." ఇలా తిట్టుకుంటూ బాబు తన మూటని చేత్తో పట్టుకొని ఆ అర్ధరాత్రి వీధిలోకి గంతేశాడు. గంగి గుమ్మం దగ్గరకు పరుగెత్తి "నా సంగీతప్పెట్టె యిచ్చేయ్" అని కేకలేసింది. వినిపించుకోకుండా దట్టమైన ఆ చీకట్లో గూడెం రోడ్డుని పరుగెత్తుకు పోయాడు బాబు.

కొంతసేపటికి తిరిగి అందరూ పడుకున్నారు. గౌరీనాథం గుర్రు కుక్క మొరిగినట్టుగా వినపడుతోంది. గుడిసెల వెనుక తుమ్మలబీడు చీకట్లో చీకటిలా వుంది.

బాబు ఎక్కడికి ఆ చీకట్లో వెళ్ళిపోయాడో, ఏమయిపోయాడో తెలియదు. కాని తిరిగి ఆ కార్డానాకిమాత్రం రాలేదు.

(విశాలాంధ్ర, 1948)